క్లుప్తంగా

కలెక్టర్‌తో భేటీ



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న రాజశేఖర్‌రెడ్డి

తిరుపతి అర్బన్: జిల్లా సహకార కేంద్ర బ్యాంక్(డీసీసీబీ) చైర్మన్ అమాస రాజశేఖర్‌రెడ్డి కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌ను కలిశారు. డీసీసీబీ చైర్మన్‌గా ఇటీవల నియామకం అయిన నేపథ్యంలో ఆయన మర్యాదపూర్వకంగా గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి ఆయనకు పుష్పగుచ్ఛం అందించారు.

మై టీచర్ నాన్పరేల్ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, అధ్యాపకులు

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం సావేరీ సెమినార్ హాల్లో ఆంగ్ల శాఖకు చెందిన ఆచార్య హరిపద్మరాణి రచించిన 'మై టీచర్ నాన్పరేల్' అనే పుస్తకాన్ని వీసీ ప్రొఫెసర్ ఉమ, రిజిస్ట్రార్ రజని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రచయిత్రి మాట్లాడుతూ తాను హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో చదువుకునే సమయంలో ఆంగ్ల శాఖకు హెడ్‌గా ఉన్న ఆచార్య సుధాకర్ మరాఠేతో తనకు ఉన్న అనుబంధాన్ని, ఆయన వ్యక్తిత్వాన్ని, విద్యార్థులపైన ఆయన ప్రభావం ఎలా ఉండేదో ఈ పుస్తకంలో ఆవిష్కరించబడ్డాయన్నారు. తరగతి గదిలో ఒక గురువు చూపే బోధనా నైపుణ్యాల కన్నా ఆయన తరగతి బయట చూపే వ్యక్తిత్వం విద్యార్థులను ఎక్కువ ప్రభావితం చేస్తుంది అనేదానికి ఉదాహరణలు ఎన్నో ఈ పుస్తకంలో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రొఫెసర్ మధురాంతకం నరేంద్ర, డీన్ ఆచార్యవాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన



శ్రీనివాసంలో వైద్యశిబిరం నిర్వహిస్తున్న ఈఎస్ఐ ఆస్పత్రి వైద్యులు

తిరుపతి తుడా: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని టీటీడీకి చెందిన శ్రీనివాసం కాంప్లెక్స్‌లో పని చేసే కార్మికుల కోసం గురువారం ఈఎస్ఐ ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్యాంబాబు మాట్లాడుతూ కార్మికులకు ఈఎస్ఐ ఆస్పత్రి అందిస్తున్న వైద్య సేవలను వారికి చేరువ చేసేందుకు అవగాహన శిబిరాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. శిబిరంలో డాక్టర్లు ధనుంజయ రెడ్డి, మృణాళిని, హెడ్ నర్స్ అనసూయమ్మ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



విద్యార్థులకు పట్టాను అందజేస్తున్న కళాశాల చైర్మన్ డాక్టర్ గంగిరెడ్డి

తిరుపతి సిటీ: స్థానిక కరకంబాడి రోడ్డులోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో మూడవ గ్రాడ్యుయేషన్ డే గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జేఎన్టీయూ వీసీ ప్రొఫెసర్ సుదర్శన్ రావు, గౌరవ అతిథిగా గాదంకి ఎన్ఏఆర్ఎల్ డైరెక్టర్ అమిత్ కుమార్ పాత్ర హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాదముని రెడ్డి మాట్లాడుతూ 723 మంది విద్యార్థులకు పట్టాలను అందించడం జరిగిందన్నారు. కళాశాల చైర్మన్ డాక్టర్ గంగిరెడ్డి మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి ప్రోత్సహిస్తున్నామని, గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న ఇంజనీరింగ్ విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ దుర్గాప్రసాద్, డాక్టర్ గురుజవహర్, డాక్టర్ రమ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో శ్రీదేవి



తిరుమల: తిరుమల శ్రీవారిని గురువారం కోర్టు సినిమా మూవీ నటి శ్రీదేవి దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

ఏటీఎంలో డబ్బులు లేవు



తిరుపతి అర్బన్: ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుపతి నగరానికి నిత్యం వేలాదిమంది భక్తులు ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్ ఆధారంగా ప్రయాణాలు సాగిస్తుంటారు. ఈ క్రమంలో పలు బ్యాంకులు ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్ రిజర్వేషన్ కౌంటర్ వద్ద ఏటీఎం సెంటర్లు ఏర్పాటుచేశాయి. వాటిలో నగదు లేకపోవడంతో ప్రయాణికులు నానాతిప్పలు పడుతున్నారు. గతంలో తిరుపతి నగరంలో ఇతర ఏటీఎంల్లో నగదు ఉన్నా లేకున్నా ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్‌లోని ఏటీఎంల్లో లభించేది. కొంతకాలంగా ఇక్కడ ఏటీఎంలు అలంకారప్రాయంగా మారాయి. బ్యాంకు అధికారులు తమ ఏటీఎంల్లో నిత్యం నగదు ఉండేలా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఉంటుందా..ఊడుతుందా..?

- ఎస్వీయూ అకడమిక్ కన్సల్టెంట్లకు అగ్ని పరీక్ష
- ఎవరి ఉద్యోగం ఉంటుందో.. ఊడుతుందో తెలియని అయోమయం
- ఫర్ఫార్మెన్స్ రివ్యూ పేరిట ఇంటర్వ్యూలకు సిద్ధమైన అధికారులు



ఎస్వీయూ పరిపాలనా భవనం

తిరుపతి సిటీ: ఎస్వీయూలో గత కొన్నేళ్లుగా పని చేస్తున్న అకడమిక్ కన్సల్టెంట్ల పరిస్థితి అయోమయంలో పడింది. ఎవరి ఉద్యోగం ఊడుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. 2025–26 అకడమిక్ విద్యా సంవత్సరం మొదలైన నేపథ్యంలో వర్సిటీలో పనిచేస్తున్న సుమారు 264 మంది తాత్కాలిక అధ్యాపకులకు స్క్రూటీనీ ఫర్ఫార్మెన్స్ రివ్యూ పేరుతో ఇంటర్వ్యూలు నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే విభాగాల వారీగా అకడమిక్ కన్సల్టెంట్ల వివరాలపై ప్రత్యేక కమిటీ ద్వారా ఆరా తీస్తున్నారు. ఈనెల 30వ తేదీ నుంచి విభాగాల వారీగా వచ్చిన సమాచారాన్ని అనుసరించి తాత్కాలిక అధ్యాపకులతో ఫర్ఫార్మెన్స్ రివ్యూ పేరుతో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు.

టెన్షన్.. టెన్షన్..!

వర్సిటీలో సుమారు 10 నుంచి 20 ఏళ్లుగా పనిచేస్తున్న తాత్కాలిక ఉద్యోగులు తమ ఉద్యోగాలు ఉంటాయో... ఊడుతాయో అంటూ టెన్షన్ పడుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అధికారులు ఫర్ఫార్మెన్స్ రివ్యూలు చేయడం సమంజసం కాదని, ఎంతో మంది అధ్యాపకులు రిటైర్డ్ స్టేజీలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరికొన్ని డిపార్ట్‌మెంట్లలో పనిచేసే అకడమిక్ కన్సల్టెంట్ల పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. 30 శాతం కంటే తక్కువగా హాజరు ఉన్న విభాగాల్లోనూ, మెర్జింగ్ చేసిన విభాగాల్లోనూ పనిచేస్తున్న తాత్కాలిక అధ్యాపకులను తొలగించేందుకు అధికారులు సిద్ధమవుతున్నట్లు అధ్యాపకులు వాపోతున్నారు. కొన్నేళ్లుగా పనిచేస్తున్న మమ్ములను రోడ్డుపాలు చేస్తే మా పరిస్థితి ఏంటని ఆవేదన చెందుతున్నారు.

అయోమయంలో ఆర్ట్స్ విభాగాల అధ్యాపకులు

ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ సైన్స్, కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలలో పనిచేసే అధ్యాపకులను అవసరాన్ని బట్టి చాలా వరకు కొనసాగిస్తారని, ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్‌లోని పలు విభాగాల్లో పనిచేసే అధ్యాపకుల పరిస్థితి అయోమయంలో పడిందని వర్సిటీలో తాత్కాలిక అధ్యాపకులు చర్చించుకుంటున్నారు. ఆర్ట్స్ గ్రూపుల్లోలో అడ్మిషన్లు తగ్గిపోవడంతోనే తాత్కాలిక అధ్యాపకులను తొలగించేందుకు వర్సిటీ అధికారులు చర్యలు తీసుకుంటున్నారని కొందరు అభిప్రాయపడుతుంటే.. మరికొందరు కూటమి ప్రభుత్వం అనుకూల వర్గాన్ని కొనసాగించి మిగిలి వారిని ఇంటికి పంపే ప్రయత్నాల్లో భాగంగానే ఈ స్క్రూటీనీ ప్రక్రియ అంటూ వాపోతున్నారు. వర్సిటీలో ప్రస్తుతం స్క్రూటీనీ ఆయా విభాగాల ఆధ్వర్యంలో ప్రిన్సిపల్స్, డీన్‌ల ఆధ్వర్యంలో ముమ్మరంగా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. మరో రెండు రోజుల్లో ఎంతమందిని తొలగిస్తారనే విషయం స్పష్టం కానుంది.

తొలగిస్తే న్యాయపోరాటం తప్పదా..!

గత కొన్ని ఏళ్లుగా వర్సిటీకి సేవ చేసిన తాత్కాలిక అధ్యాపకులను తొలగించే ప్రయత్నాలు చేస్తే న్యాయపోరాటం చేసేందుకు అకడమిక్ కన్సల్టెంట్లు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. చాలామంది అధ్యాపకులు పదవీ విరమణకు దగ్గరలో ఉన్నారని, అధికారులు అకడమిక్ కన్సల్టెంట్ల దయనీయ పరిస్థితిని అర్థం చేసుకుని అందరినీ కొనసాగించేందుకు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. లేనిపక్షంలో తమకు న్యాయం చేయాలని కోర్టు మెట్లు ఎక్కక తప్పదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ కళాశాలలు



ప్రోత్సాహక బహుమతులు అందుకున్న విద్యార్థినులతో అధ్యాపకులు

చంద్రగిరి: ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నట్లు ప్రభుత్వ బాలిక జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రాజశేఖర్ రెడ్డి తెలిపారు. స్థానిక బాలికల కళాశాలలో గురువారం దాతల సహకారంతో పాటు కళాశాల అధ్యాపకులు, సిబ్బంది తోడ్పాటుతో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థినులకు ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025 విద్యా సంవత్సరం నుంచి రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు టెక్స్ట్ బుక్స్, నోట్ బుక్స్, విద్యార్థులకు రికార్డులు సైతం ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో సన్నబియ్యం వినియోగిస్తున్నట్లు చెప్పారు. మన కళాశాలకు చెందిన పి.అపర్ణ అమరావతి విట్ కళాశాలలో ఫ్రీ సీటు సాధించినట్లు తెలిపారు. చంద్రగిరి ప్రభుత్వ బాలికల పాఠశాల, కళాశాలలో టీచర్లు, లెక్చరర్లు విద్యాబోధన కోసం పోటీతత్త్వం అలవరుచుకోవడం వారిలోని అంకితభావానికి నిలువెత్తు సాక్ష్యమని కొనియాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

పెరియాళ్వార్ ఉత్సవాలు ప్రారంభం



ప్రబంధ పాశురాలను నివేదిస్తున్న పెద్దజీయర్, చిన్నజీయర్ స్వామి, అర్చకులు

తిరుపతి కల్చరల్: గోవిందరాజస్వామి ఆలయ అనుబంధ శ్రీలక్ష్మి నారాయణస్వామి ఆలయంలో గురువారం పెరియాళ్వార్ ఉత్సవం ఘనంగా ప్రారంభమైంది. శ్రీమహావిష్ణువుకు పెరియాళ్వార్ పరమభక్తుడు, శ్రీఆండాళ్ అమ్మవారి తండ్రిగా పెరియాళ్వార్ ప్రతి రోజూ తులసి మాలలు కట్టి స్వామివారికి సమర్పించేవారు. అనేక పాశురాలు రచించి స్వామివారికి అర్పించారు. ఆయనకు శ్రీమహావిష్ణువు సాక్షాత్కారం జరిగినట్లు అర్చకులు తెలిపారు. స్వామి వారి పరమభక్తుడైన శ్రీపెరియాళ్వార్‌కు గురువారం నుంచి జూలై 5వ తేదీ వరకు ఉత్సవాలు జరుగనున్నాయి. ఇందులో భాగంగా ఉదయం, సాయంత్రం పెద్ద జీయంగార్ స్వామి, చిన్నజీయంగార్ స్వామి తమ శిష్యబృందంతో కలిసి శ్రీలక్ష్మీనారాయణస్వామివారి ఆలయంలోని శ్రీపెరియాళ్వార్ వారి సన్నిధిలో ప్రబంధ పాశురాలను నివేదించారు. చివరోజైన జూలై 5వ తేదీ ఉదయం శ్రీ పెరియాళ్వార్‌కు తిరుమంజనం నిర్వహిస్తారు. అదే రోజు సాయంత్రం గోవిందరాజ స్వామి వారు గరుడ వాహనంపై, శ్రీపెరియాళ్వార్ గజ వాహనంపై కొలువై ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షిస్తారు.

కార్పొరేట్ స్కూళ్ల దోపిడీని అరికట్టండి



డీఈఓకు వినతిపత్రం సమర్పిస్తున్న బీసీ విద్యార్థి సంఘ నేతలు

తిరుపతి కల్చరల్: తిరుపతి నగరంలో పుట్టగొడుగుల్లా పుట్టకొస్తున్న విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి లక్షల రూపాయలు ఫీజులు వసూళ్లు చేస్తున్న కార్పొరేట్, ప్రైవేటు స్కూళ్ల దోపిడీని అరికట్టాలని బీసీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నారాయణ గౌడ్ డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం ఆయన డీఈఓ కేవీఎస్ కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీబీఎస్ఈ సిలబస్, ఈ టెక్నో, ఒలింపియాడ్ వంటి పేర్లతో అమాయక తల్లిదండ్రులను మోసం చేస్తూ లక్షల రూపాయలు గుంజుకుంటూ విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారని ఆరోపించారు. విద్యార్థులను రక్షించి అధిక ఫీజుల దోపిడీకి పాల్పడుతున్న స్కూళ్లను మూసివేయాలని కోరారు. ఆయనతో పాటు బీసీ విద్యార్థి విభాగం జిల్లా నేత పవన్‌కుమార్ యాదవ్ ఉన్నారు.

చదువుపై దృష్టి పెడితే బంగారు భవిత


- ఘనంగా అంతర్జాతీయ మాదక ద్రవ్య వ్యతిరేక దినోత్సవం
- ఎస్పీ హర్షవర్ధన్‌రాజు



జ్యోతి ప్రజ్వలన చేసిన ప్రారంభిస్తున్న ఎస్పీ, రుయా సూపరింటెండెంట్

తిరుపతి తుడా: విద్యార్థులు చదువుపై దృష్టి పెడితే బంగారు భవితతో పాటు జీవితం మాధుర్యంగా ఉంటుందని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు పిలుపునిచ్చారు. గురువారం అంతర్జాతీయ మాదక ద్రవ్య వ్యతిరేక దినోత్సవం స్థానిక ఎస్వీ వైద్యకళాశాల భువన విజయం ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ డ్రగ్ అనేది ఒక రాష్ట్ర సమస్య కాదని జాతీయ సమస్యగా మారిందన్నారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలు ఎవరైనా సేవిస్తున్నప్పుడు వెంటనే దాన్ని నివారించడానికి పోలీసు వారికి సమాచారం ఇవ్వాలన్నారు. డ్రగ్స్‌ను నివారించాలంటే సమిష్టి కృషితోనే సాధ్యం అవుతుందన్నారు. స్కూల్ నుంచి కాలేజీకి వెళ్లే సమయంలో కొత్త కొత్త వాటికి అలవాటు పడతారని, అలవాటు పడిన సమయంలో వాటికి బానిసలుగా మారతారన్నారు. అలవాటు సరదాగా మొదలై వారి జీవితాన్ని వారే పూర్తిగా నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. యువత చెడు మార్గాల వైపు వెళ్లకుండా మంచి మార్గాల వైపు వెళ్లే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రాధ, డాక్టర్ మల్లికార్జున్, డాక్టర్ కవిత, డీఎస్పీ శ్రీలత, ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణాచారి, సీఐ తమీమ్ అహ్మద్, వైద్యవిద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో జీవితానికి చేటు



తిరుచానూరులో..

చంద్రగిరి: మాదక ద్రవ్యాలను వినియోగించడం ద్వారా మానవ జీవితానికి అనర్థాలు తెచ్చిపెడతాయని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. గురువారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా తిరుచానూరులో పంచాయతీ ఈఓ మణి, చంద్రగిరిలో ఎమ్మెల్యే నాని అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు. సీఐ సుబ్బరామిరెడ్డి, ఎక్సైజ్, రెవెన్యూ, విద్యాశాఖ అధికారులతో పాటు మండల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాకాలలో..

పాకాల : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్‌వీ రమేష్‌కుమార్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. స్థానిక పోలీసులు సీఐ సుదర్శన్ ప్రసాద్ ప్రభుత్వం ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలసి పాకాల ఆర్టీసీ బస్టాండ్ వద్ద మానవహారం ఏర్పాటు చేసి ర్యాలీ నిర్వహించారు.



పాకాల: మానవ హారం ఏర్పాటు చేసిన విద్యార్థులు

ఆయుష్ వైద్యురాలు ఉమాదేవికి వీడ్కోలు



డాక్టర్ ఉమాదేవి, వీఆర్ రాసాని దంపతులను సన్మానిస్తున్న సిబ్బంది

భాకరాపేట : ఆయుష్ విభాగంలో సీనియర్ వైద్యురాలు, ప్రముఖ రచయిత్రి డాక్టర్ ఉమాదేవికి గురువారం భాకరాపేట ప్రాథమిక వైద్య కేంద్రంలో ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉమాదేవితో పాటు భర్త ప్రముఖ సుప్రసిద్ధ నవలా రచయిత డాక్టర్ వీఆర్ రాసానిని ఘనంగా సన్మానించారు. పలువురు ప్రముఖులు మాట్లాడుతూ వైద్య రంగంలో ప్రజలకు వైద్యసేవలు అందిస్తూనే ఉమాదేవి రచనలు స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ లింగయ్య, వైద్యులు హేమంత్‌కుమార్‌రెడ్డి, నరసింహులు, అలెగ్జాండర్, నిరంజన్‌రెడ్డి, పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న శ్రీపతి చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: శ్రీపతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం మెటర్నటీ ఆస్పత్రి వద్ద పేదలకు అన్నదానం చేశారు. ట్రస్ట్ వ్యవస్థాపకుడు నరసింహ మాట్లాడుతూ నిరాశ్రయులు, అనాథలు, నిరుపేదల ఆకలి తీర్చాలనే లక్ష్యంతో రోజూ ట్రస్ట్ ద్వారా అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా పుట్టిన రోజులు, పెళ్లి రోజులు, తల్లిదండ్రుల జ్ఞాపకార్థం చేసే వారు ఆకలితో ఉన్నవారికి అన్నదానం చేయాలని కోరారు.

స్విమ్స్ కార్మికుల రిలే నిరాహార దీక్ష



ప్రసంగిస్తున్న కందారపు మురళి

తిరుపతి తుడా: స్విమ్స్ యాజమాన్యం కార్మికుల పట్ల అనుసరిస్తున్న మొండి వైఖరి విడనాడి సమస్యలు పరిష్కరించాలని గురువారం సిమ్స్ క్యాజువాలిటీ ఎదురుగా కార్మికులు గురువారం నిరసన తెలుపుతూ నిరాహార దీక్షలు ప్రారంభించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ స్విమ్స్ యాజమాన్యం కార్మికుల పట్ల అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా రిలే నిరాహార దీక్షలు ప్రారంభించామన్నారు. 28న జరిగే చర్చలు సఫలం కాకపోతే 30వ తేదీ నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. స్విమ్స్ వర్కింగ్ ప్రెసిడెంట్ వేణుగోపాల్, యూనియన్ నేతలు, కార్మికులు పాల్గొన్నారు.

నోటీస్ బోర్డు

- తనపల్లి క్రాస్ రోడ్డు వద్ద ఉన్న తాజ్ హోటల్లో ఉదయం 9.45 గంటలకు ప్రపంచ ఎంఎస్ఎంఈ దినోత్సవం వేడుకలు
- రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఎంఆర్‌పల్లిలోని ఆర్‌పీఐ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు పౌరహక్కుల ఉద్యమ నేత, బొజ్జాతారకం 86వ వర్ధంతి సభ
- జూలై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె నేపథ్యంలో సమ్మె జయప్రదం కోసం ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ సంఘాల ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు ఏఐటీయూసీ కార్యాలయంలో ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం
- పెరుమాళ్లపల్లిలోని శ్రీకంచి కామకోటి స్మార్త పాఠశాలలో 3 నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులకు ప్రవేశాలకు పాఠశాలలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 వరకు ఇంటర్వ్యూలు
- పునర్వసు నక్షత్రం సందర్భంగా శ్రీకోదండరామాలయంలో ఉదయం 11 గంటలకు శ్రీసీతారాముల కల్యాణం, సాయంత్రం 5.30 గంటలకు స్వామివారి తిరుచ్చి ఉత్సవం
- శుక్రవారం సందర్భంగా తిరుచానూరులోని శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంలో సాయంత్రం 6 గంటలకు తిరుచ్చిపై ఊరేగుతూ భక్తులకు అమ్మవారు దర్శనం
- అప్పలాయగుంటలోని శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉదయం 7 గంటలకు వస్త్రాలంకరణ సేవ, అభిషేకం
- శ్రీగోవిందరాజస్వామి ఆలయంలో సాయంత్రం 6 గంటలకు శ్రీఆండాళ్ అమ్మవారు, శ్రీపుండరీక అమ్మవారు ఆలయ మాడవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించనున్నారు
- తిరుపతిలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న శ్రీనివాసం, రైల్వేస్టేషన్ వద్దనున్న విష్ణు నివాసం, అలిపిరి వద్ద ఉన్న భూదేవి కాంప్లెక్స్‌లో తిరుమలకు శ్రీవారి మెట్లు నడకమార్గంలో వెళ్లే భక్తులకు సాయంత్రం 3.30 నుంచి 4 గంటల వరకు శ్రీవారి ఉచిత దర్శనం టోకెన్లు పంపిణీ

వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి



ప్రజలతో మాట్లాడుతున్న కమిషనర్

తిరుపతి తుడా: వర్షాలు కురుస్తున్న తరుణంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా అప్రమత్తంగా ఉంటూ అన్ని చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య అధికారులను ఆదేశించారు. గురువారం నగరంలోని 15వ వార్డులోని పద్మావతి పార్క్, పరిసర ప్రాంతాల్లో అధికారులతో కలసి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ప్రతి రోజూ చెత్త బండి వస్తోందా, తాగునీరు సకాలంలో వస్తున్నాయా అనే విషయాలు ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న తరుణంలో పారిశుద్ధ్య పనులు మెరుగ్గా చేపట్టాలని సూచించారు. వర్షపు నీరు రోడ్లపైకి రాకుండా మురుగునీటి కాలువల్లో చెత్తను తొలగించాలని, దోమలు ప్రబలకుండా మందులు పిచికారీ చేయించాలని ఆదేశించారు. పద్మావతి పార్కులోని వాకింగ్ ట్రాక్‌లో గుంతలను సరి చేసి, శుభ్రంగా ఉంచాలని, రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అలాగే అన్నా క్యాంటీన్‌ను పరిశీలించి, ప్రజలకు నాణ్యమైన ఆహార పదార్థాలను అందించాలని సూచించారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మున్సిపల్ ఇంజినీర్ తులసి కుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

6న బీసీ ఆత్మగౌరవ భరోసా సభ



ప్రచార రథాలను ప్రారంభిస్తున్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శంకరరావు, బీసీ నేతలు

తిరుపతి కల్చరల్: బహుజనుల హక్కుల సాధనే లక్ష్యంగా జూలై 6వ తేదీన తిరుపతిలోని ఇందిరా మైదానంలో భారీస్థాయిలో నిర్వహించనున్న బీసీ ఆత్మగౌరవ భరోసా సభకు జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలంతా వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని ఏపీ బీసీ సంక్షేమ సంఘం నేతలు పిలుపునిచ్చారు. బీసీ సభ విజయవంతాన్ని కాంక్షిస్తూ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బాలాజీ కాలనీలోని పూలే విగ్రహం సర్కిల్లో ఏర్పాటు చేసిన ప్రచార రథాలను గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, అతిథులుగా బీసీ సభ కన్వీనర్ ఆల్‌మెన్‌రాజు, జిల్లా అధ్యక్షుడు కల్లూరి నాగరాజు గౌడ్ హాజరై తొలుత పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జెండా ఊపి ప్రచార రథాలను ప్రారంభించారు. బహుజనుల హక్కుల సాధనే లక్ష్యంగా రాజకీయాలకు అతీతంగా జూలై 6వ తేదీన ఇందిరా మైదానంలో మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించే బీసీ ఆత్మగౌరవ భరోసా సభకు రాష్ట్రమంత్రులు, బీసీ ప్రజాప్రతినిధులు, రాష్ట్ర బీసీ సంఘం నేతలు హాజరు కానున్నారని చెప్పారు. దళిత నేతలు పరసారత్నం, రిటైర్డు జడ్జి గుర్రప్ప, ధనశేఖర్, బీసీ సంక్షేమ సంఘం నేతలు, బీసీలు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 75,001 మంది స్వామివారిని దర్శించుకోగా 23,765 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 3.67 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 08 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

వేడుకగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



తిరుమంజనం కార్యక్రమంలో ఆలయ అధికారులు

చంద్రగిరి : శ్రీనివాస మంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో జూన్ 30 నుంచి జులై 2వ తేదీ వరకు జరగనున్న సాక్షాత్కార వైభవోత్సవాలను పురస్కరించుకుని గురువారం వేడుకగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపట్టారు. ఈ సందర్భంగా తెల్లవారుజామున సుప్రభాతంతో స్వామి వారిని మేల్కొలిపి తోమాల సేవ, కొలువు, పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఉదయం 7 నుంచి 11.30 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపట్టారు. ప్రోక్షణం అనంతరం మధ్యాహ్నం 12.30 గంటల నుంచి భక్తులను దర్శనానికి అనుమతించారు. ఈ కార్యక్రమంలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మునిశేఖర్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, అర్చకులు పాల్గొన్నారు.

పాలనపై సర్పంచ్‌లకు శిక్షణ

తిరుపతి రూరల్ : గ్రామ పంచాయతీల్లో పరిపాలనపై పట్టు సాధించాలన్నా, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నా.. పంచాయతీరాజ్ చట్టాలు, నిధులపై అవగాహన పెంచుకోవాలని ఎంపీడీఓ రామచంద్ర వెల్లడించారు. దీనిపై తరచుగా నిర్వహించే శిక్షణలో ప్రతి మహిళా సర్పంచ్ తప్పక హాజరు కావాలన్నారు. తిరుపతి రూరల్ ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన మహిళా సర్పంచ్‌ల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహిళా సర్పంచ్‌లు పాలనాపరంగా తప్పులు చేయకుండా ప్రజలకు మంచి చేయాలంటే ఈ శిక్షణా తరగతులు ఎంతో అవసరమన్నారు. పంచాయతీరాజ్ చట్టంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులు, వాటిని ఎలా ఖర్చు చేయాలన్న అంశాలను ఈ శిక్షణలో అర్థమయ్యేలా చెప్పడం జరుగుతుందన్నారు. గత మూడు రోజులుగా జరుగుతున్న ఈ శిక్షణలో గురువారం ఎర్రావారిపాళెం, చిన్నగొట్టిగల్లు, పాకాల, వడమాలపేట, రేణిగుంట మండలాలకు చెందిన మహిళా సర్పంచ్‌లు హాజరయ్యారు. సర్పంచ్‌లకు పాకాల డిప్యూటీ ఎంపీడీఓ శశికళ, రేణిగుంట డిప్యూటీ ఎంపీడీఓ ప్రభురావు, పంచాయతీ కార్యదర్శి సుధారాణి శిక్షణ అందించారు.

భళా సాన్వీ..



లావణి నృత్యం చేస్తున్న ట్రాన్స్ ఉమెన్ డాక్టర్ సాన్వీ జేత్వానీ

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీ సంగీత, నృత్య, లలిత కళల విభాగంలో రాష్ట్రీయ ఉన్నత విద్యాభియాన్ (రుసా) ప్రాజెక్టు సహకారంతో "భరతనాట్యంలో లింగ వివక్ష, అసమానతలు" అనే శీర్షికతో లింగ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గురువారం వర్సిటీలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి భరతనాట్యం, లావణి నర్తకి లో ప్రావీణ్యం పొందిన మహారాష్ట్ర నాందేడ్‌కు చెందిన ప్రముఖ ట్రాన్స్‌ఉమెన్ డాక్టర్ సాన్వీ జేత్వానీ హాజరై తాను కళారంగంలో సాధించిన విజయాలు, ఎదుర్కొన్న సవాళ్లను విద్యార్థినుల కు వివరించారు. తాను మేనేజ్‌మెంట్ సైన్స్, ఫోక్ డ్యాన్స్‌లలో రెండు పీహెచ్‌డీలు అందుకున్నానని, జాతీయ, అంతర్జాతీయ అవార్డులు సొంతం చేసుకోవడం ప్రతిభతోనే సాధ్యమని తెలిపారు. అనంతరం ఆమె లావణి నృత్య ప్రదర్శన చేసి వీక్షకులను అలరింపజేశారు. కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ ఉమ, రిజిస్ట్రార్ రజిని, ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ హిమబిందు, డీన్ ప్రొఫెసర్ వాణి, విభాగాధిపతి ఆచార్య శైలేశ్వరి, విద్యార్థినులు పాల్గొన్నారు.